## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జక్రాన్‌పల్లి: చింతలూర్‌లో బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే టీఎస్ ఆర్టీసీ చైర్మన్ సహకారంతో గ్రామానికి చెందిన నర్సయ్యకు రూ.16వేలు, గోదావరికి రూ.12వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయ్యాయి. ఈ చెక్కులను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. చింతలూర్ ఉపసర్పంచ్ జలంధర్, నాయకులు కుంచాల రాజు, అక్బర్‌ఖాన్, చిట్ల శ్యామ్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు ప్రశంసా పత్రాలు



నిజామాబాద్ సిటీ: 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం నిజామాబాద్ రిలయన్స్ ట్రెండ్స్ షాపింగ్ మాల్ నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్టోర్ మేనేజర్ అనంతరాములు, డిపార్టుమెంటు మేనేజర్ జగదీష్‌లు మాట్లాడుతూ.. విద్యార్థులకు తమ గురువులతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం లభిస్తే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్లు విద్యార్థులతో తమ అనుబంధాలను పంచుకున్నారు. ప్రతిభ చాటిన 30 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్, షాపింగ్ కూపన్స్ బహూకరించి ప్రోత్సహించారు.

### ఎమ్మెల్యేకు సన్మానం

జక్రాన్‌పల్లి: కొలిప్యాక్ గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఘనంగా సన్మానించారు. కొలిప్యాక్ గ్రామానికి వెళ్లే పంచాయతీ రాజ్ రోడ్డును ఆర్అండ్‌బీ రోడ్డుగా మార్చినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాలయ్య, సొసైటీ మాజీ చైర్మన్ ఇట్టెడి గణేశ్, గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు తిరుపతి, దినేష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

### ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీలో జిల్లా వాసికి స్థానం



ఖలీల్‌వాడి: ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు నర్సంపేట పట్టణంలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో జరిగాయి. ఈ ప్లీనరీలో 43 మందిని రాష్ట్ర కమిటీ సభ్యులుగా, ఆరుగురు సభ్యులను ఆహ్వానితులుగా ఎన్నుకున్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మైత్రి రాజశేఖర్‌ని రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైత్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. పార్టీ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

### డ్రైవర్లపై అధికారుల వేధింపులు

నిజామాబాద్‌నాగారం: నగరంలో ఆటో, ట్రాక్టర్, ఇతర వాహనాల్లో ప్రతినిత్యం చెత్త సేకరణ జరుగుతుంది. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు డ్రైవర్లు, కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేపడుతున్నారు. విధులు ముగించుకొని జిల్లా కేంద్రంలోని డీఆర్‌సీ కేంద్రంలో వాహనాలు పెట్టాలి. అయితే అరగంట ముందు వచ్చినా వాహనాలను లోనికి రాకుండా గేటుకు తాళం వేస్తున్నారు. గతంలో చెత్త సేకరణ పూర్తి చేసిన కార్మికులు తమ వాహనాలు డీఆర్‌సీలో పెట్టడానికి అనుమతి ఉండేది. అయితే ఇటీవల జోన్-5లో జవాన్ వెంకటస్వామి కార్మికులను అసభ్య పదజాలంతో దూషించినందుకు నిరసన చేపట్టారు. దీంతో అధికారులు కక్ష్య సాధింపు చర్యలో భాగంగానే వాహనాలు లోనికి అనుమతించడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

### 9న లలితాదేవి ఆశ్రమాలయ 20వ వార్షికోత్సవం

నిజామాబాద్‌సిటీ: నగరంలోని లలితాదేవి ఆశ్రమాలయ 20వ వార్షికోత్సవం ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పలు రకాల పూజలు చేయనున్నట్లు చెప్పారు.

### గణపతి ఆలయాల్లో సంకష్టహర చతుర్థి పూజలు

నిజామాబాద్‌సిటీ: నగరంలో సార్వజనిక్ గణేశ్ మందిర్, బొడ్డెమ్మ చెరువు దగ్గర గల మహాగణపతి దేవాలయం, గాయత్రినగర్‌లో సిద్ధిబుద్ధి వినాయక ఆలయం, ధర్నాచౌక్ వద్ద శుభం కరోతి గణపతి ఆలయాల్లో బుధవారం సంకష్ట హర చతుర్థి పురస్కరించుకుని పంచమృతాభిషేకం, సింధూర సమర్పణ, గరిక పూజ నిర్వహించనున్నట్లు ఆలయాల నిర్వహకులు తెలిపారు.

# ఖానాపూర్ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- టెండర్ పూర్తయినా మొదలుకాని పనులు
- కొత్తరోడ్డు కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ



నగరంలోని ఒకటో డివిజన్‌లో అధ్వానంగా మారిన బీటీ రోడ్డు

నిజామాబాద్ సిటీ : దేవుడు వరం ఇచ్చిన పూజారి కరుణించలేదన్నట్లుగా ఉంది ఖానాపూర్ బీటీరోడ్డు పరిస్థితి. నగరంలోని ఒకటో డివిజన్ ఖానాపూర్ రోడ్డుకు మోక్షం కలిగి నెలరోజులవుతున్న ఇప్పటికీ పనులు మొదలు కావటంలేదు. అధ్వానంగా ఉన్న రోడ్డుపై వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఒకటో డివిజన్ పరిధి కాలూర్ రోడ్డు నుంచి ఖానాపూర్ గ్రామం మీదుగా జన్నెపల్లిరోడ్డు వరకు బీటీరోడ్డు అధ్వానంగా మారింది. ఈ ప్రాంతంలో అనేక రైస్‌మిల్లులు, ఇతర ఫ్యాక్టరీలు ఉండటంతో భారీలోడ్‌తో వాహనాలు నిత్యం వందల సంఖ్యలో తిరుగుతుంటాయి. దాంతో రోడ్డు చెడిపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గత ఐదేళ్లుగా రోడ్డు ఇదే విధంగా ఉండటంతో ఖానాపూర్‌వాసులు, వాహనదారులు నిత్యం నరకం భరిస్తున్నారు. ఎండ, చలి కాలలలో రోడ్డుపై దుమ్ముతో, వానాకాలంలో రోడ్డుపై గుంతలలో వర్షం నీళ్లు నిలిచి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు దుస్థితిపై ఖానాపూర్ వాసులు స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను పలుమార్లు కలిసి రోడ్డుతో పడుతున్న ఇబ్బందుల గురించి దృష్టికి తీసుకెళ్లారు. గత వానాకాలంలో రోడ్డు బాగా దెబ్బతినటంతో చిన్న గుంతలు పెద్దగా మారాయి. దాంతో కార్పొరేటర్ కంకర మిక్స్‌ను గుంతలలో వేయించటంతో కొంతమేరకు ఉపశమనం కలిగింది. ఎండాకాలంలో బీటీరోడ్డు పనులు వేసేందుకు పనులను పబ్లిక్ హెల్త్‌కు అప్పగించారు.

#### రూ. కోటితో రెన్నెళ్ల క్రితమే..

ఖానాపూర్‌లో కొత్తగా బీటీరోడ్డు వేసేందుకు రెండునెలల క్రితమే టెండర్లు పూర్తికాగా నెలరోజుల క్రితం రూ. ఒక కోటితో పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కానీ పనులు నేటికి ప్రారంభం కాలేదు. వచ్చేది వానాకాలం కాబట్టి వానాకాలంలో బీటీరోడ్డు పనులు వేయటం కుదరదు. పనులు ఇప్పుడు మొదలు కాకపోతే వానాకాలం పూర్తయ్యేంతవరకు ఆగాల్సి వస్తుందని ఖానాపూర్ వాసులు నిరుత్సాహపడుతున్నారు.

#### 15 రోజుల్లో పనులు చేయిస్తాం

ఖానాపూర్‌లో బీటీరోడ్డు పనులకు టెండర్లు పూర్తి అయి శంకుస్థాపన కూడా జరిగింది. ఈ పనులు ఎందుకని ప్రారంభించటంలేదో ఆ కాంట్రాక్టర్‌ను పిలిచి మాట్లాడుతాం. 10 నుంచి 15 రోజుల్లోపు పనులను ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటాం. వానాకాలం ఆరంభంలోపే పనులు పూర్తి చేస్తాం.

– తిరుపతిరెడ్డి, ఈఈ, పబ్లిక్ హెల్త్ విభాగం

# అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు

- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్



ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేస్తున్న బాజిరెడ్డి

నిజామాబాద్ సిటీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని కులాలు, వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం నిజామాబాద్‌లోని తన నివాసంలో డిచ్‌పల్లి, నిజామాబాద్ రూరల్, మోపాల్ మండలాలకు సంబంధించిన వివిధ కుల సంఘాల సభ్యులకు రూ. 3 2లక్షల విలువ గల ఎస్‌డీఎఫ్ ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని, రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం మోపాల్ మండలం బాడ్సిలో అయ్యప్ప శాలివాహన కమ్మరి సంఘానికి రూ.5 లక్షలు, డిచ్‌పల్లి మండలం యానంపల్లిలో గంగపుత్ర సంఘానికి రూ.5 లక్షలు, యాదవ సంఘానికి రూ.5 లక్షలు, పద్మశాలి సంఘానికి రూ.2 లక్షలు, నిజామాబాద్ రూరల్ మండలం గూపన్‌పల్లి గ్రామంలో మున్నూరు కాపు సంఘానికి రూ.10 లక్షలు, మల్కాపూర్ (కొత్త పేట్) గ్రామంలో మున్నూరు కాపు సంఘానికి రూ.5 లక్షల విలువగల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ పాల్గొన్నారు.

# స్త్రీ నిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ టౌన్ ప్రాజెక్ట్ అధికారి రమేశ్



మాట్లాడుతున్న మున్సిపల్ టౌన్ ప్రాజెక్ట్ అధికారి

నిజామాబాద్‌నాగారం: నగరంలోని మహిళల సంఘాల సభ్యులు స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ టౌన్ ప్రాజెక్టు అధికారి రమేశ్ సూచించారు. మంగళవారం వినాయక్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో మెప్మా రిసోర్స్ పర్సన్‌లతో సమావేశం నిర్వహించారు. అధికారి రమేశ్ మాట్లాడుతూ.. మహిళా స్వయం సంఘాలు యూనిట్‌గా లేదా వ్యక్తిగతంగా ఆహార పదార్థాల తయారీ యూనిట్లకు తక్కువ వడ్డీకి స్త్రీ నిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. అలాగే పాడి పరిశ్రమ, ఇతర కుటీర పరిశ్రమల స్థాపనకు కావాల్సిన రుణం పొందవచ్చన్నారు. రుణాలు తీసుకున్న మహిళలకు బీమా కూడా కల్పిస్తామన్నారు. సమావేశంలో రీజనల్ మేనేజర్ రాందాస్, మేనేజర్ మురళీ కష్ణ, అసిస్టెంట్ మేనేజర్ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# పనుల్లో నాణ్యతతో కూడిన పురోగతి సాధించాలి

- నగర మేయర్ దండు నీతూకిరణ్



నిజామాబాద్‌నాగారం: వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతతో పాటు పురోగతి సాధించాలని నగర మేయర్ దండు నీతూకిరణ్, సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్, రెవెన్యూ, పారిశుధ్య అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా పూడికతీత పనులు తూతూ మాత్రంగా కాకుండా పకడ్బందీగా చేపట్టాలన్నారు. దోమలు నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ మున్సిపాలిటీకి రావాల్సిన ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సు ఫీజులను విధిగా వసూలు చేయాలన్నారు.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు, రిటైర్డ్ ఉద్యోగులు

నిజామాబాద్‌నాగారం: పెన్షనర్ల సమస్యలను దశాబ్ది ఉత్సవాలలో భాగంగానైనా పరిష్కరించాలని, తెలంగాణ ఏర్పాటులో పెన్షనర్లు అగ్రభాగాన నిలిచి పోరాడారని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ -రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం నాందేవ్‌వాడ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ డీఏలను విడుదల చేయడంలో, పే రివిజన్ కమిటీని ఏర్పాటు చేయడంలో, నగదు రహిత వైద్యం అందించటంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని అన్నారు. రిటైర్ అయిన రోజునే వారికి రావాలసిన ప్రయోజనాలన్నీ అదే రోజున ఇచ్చి గౌరవంగా పంపించాలని చెప్పిన మాటలు నీటి మీద రాసిన రాతల్లా మారాయన్నారు. ఈ కుబేర్లో బిల్లులన్నీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్, నారాయణ, ముత్తారం నరసింహస్వామి, శిర్ప హనుమాన్లు, తదితరులున్నారు.

### పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



సిరికొండ(డిచ్‌పల్లి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సెర్ప్ డీపీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. డిచ్‌పల్లి ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీపీఎం మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు విప్లవకుమారి, సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, రంజిత్, నవీన్, రవి, లక్ష్మణ్, హౌజ్ వైరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సాగునీటి దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



జక్రాన్‌పల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత భోజన్న

జక్రాన్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం అర్గుల్‌లో జిల్లా గురడి రెడ్డి కల్యాణ మండపంలో నిర్వహించనున్న సాగునీటి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న పిలుపునిచ్చారు. మంగళవారం జక్రాన్‌పల్లి మండల పరిషత్తు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గురడి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. ఎంపీడీవో నటరాజ్, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, జక్రాన్‌పల్లి ఉపసర్పంచ్ బాల్‌కిషన్, ఇరిగేషన్ ఏఈ సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

### క్విజ్ కాంపిటీషన్ కోసం దరఖాస్తు చేసుకోండి



నిజామాబాద్‌అర్బన్: ఈ నెల 18న నిర్వహించే రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ కోసం యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని నిశిత డిగ్రీ , పీజీ కళాశాలలోని విద్యార్థులను కలిసి క్విజ్ కాంపిటీషన్‌కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా వేణురాజ్ మాట్లాడుతూ.. పోటీలో పాల్గొనాలనుకునే అభ్యర్థులు ముందుగా 76618 99899 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని, వెంటనే రిజిస్ట్రేషన్‌కు వెబ్ లింక్‌తో కూడిన ఒక ఎస్ఎంఎస్ వస్తుందని, ఆ లింకు ద్వారా వారి వివరాలను జూన్ 17లోగా నమోదు చేసుకోవాలన్నారు. పోటీలో పాల్గొన్న అభ్యర్థులకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని మహిళా టాపర్లకు ప్రత్యేక బహుమతుల కింద ఎలక్ట్రిక్ స్కూటర్లను కూడా బహూకరిస్తామని అన్నారు. బహుమతిని సోనియా గాంధీ చేతుల మీదుగా హైదరాబాదులో ప్రదానం చేస్తారని అన్నారు. నాయకులు రమేష్ చంద్ర సందీప్ రెడ్డి, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# 'మరమ్మతులు చేయడం లేదు'




సిరికొండ: ఈదురు గాలులకు స్తంభాల విరిగిపోయి విద్యుత్ తీగలు తెగిపడినా ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదని పోత్నూర్ గ్రామానికి చెందిన రైతులు వాపోతున్నారు. స్తంభాలు పడిపోయి 15 రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు మొదలు పెడదామంటే పడిపోయిన స్తంభాలు, తెగిపోయిన తీగలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు తెలిపారు. మా పొలంలో నాలుగు స్తంభాలు పడిపోగా రెండు బిగించారని మరో రెండు బిగించడం లేదని, స్తంభాలు లేవని లైన్‌మెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతు మహిపాల్ తెలిపారు. మరొక చోట రెండు స్తంభాలు పడిపోయాయని అక్కడ కూడా ఏర్పాటు చేయడం లేదని తెలిపారు.

# తెలంగాణ యూనివర్సిటీని ప్రక్షాళన చేయండి



మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతి పత్రం అందిస్తున్న నేతలు..



తెయూలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం..

సిరికొండ(తె.యూ): తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం డిమాండ్ చేశారు. హైద్రాబాద్‌లో విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. తెయూను ప్రక్షాళన చేయాలని కోరారు. తెయూ వీసీ రవీందర్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలతో యూనివర్సిటీ భవిష్యత్తు ప్రమాదకరంగా మారిందని రఘురాం పేర్కొన్నారు. రిజిస్ట్రార్ నియామకంలో తన మాటే చెల్లుబాటు కావాలనే దుర్బుద్ధితో ఈసీ నిర్ణయాలను సైతం లెక్క చేయకుండా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠారెడ్డి, పుట్ట లక్ష్మణ్, పాల్గొన్నారు.

#### ప్రభుత్వం కిమ్మనకపోవడం శోచనీయం

సిరికొండ(తె.యూ): తెయూ ప్రతిష్ఠను నానాటికి దిగజార్చుతూ, వివాదాలకు కేంద్రంగా మార్చిన వీసీ, ఈసీల తీరుపై ప్రభుత్వం కిమ్మనకపోవడం శోచనీయమని పీడీఎస్‌యూ నేతలు పెద్దింటి రామకృష్ణ, నామాల ఆజాద్, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రసాద్‌లు అన్నారు. తెయూలో పీడీఎస్‌యు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీసీ ఈసీలు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలకు ఉపక్రమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నేతలు పాల్గొన్నారు.

# ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కంజర భూమయ్య

నిజామాబాద్‌అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మధ్యాహ్న భోజన(ఎండీఎం) కార్మికులు ధర్నా చౌక్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంజర భూమయ్య మద్దతు తెలిపి మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల పిల్లలు చదువుకునే పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు అందించాల్సిన మధ్యాహ్న భోజన కార్మికులకు కేవలం నెలకు రూ.3 వేలు చెల్లిస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. గత విద్యా సంవత్సరంలో గుడ్లు, కిరాణా వస్తువులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు.

### 'దళిత యువకుడికి న్యాయం చేయాలి'



ఇందల్వాయి: అన్సాన్‌పల్లిలో నందు అనే దళిత యువకుడి తీవ్రంగా హింసించి, అవమానకర రీతిలో గుండు గీయించిన వీడీసీ సభ్యులు, పలువురి గ్రామస్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని నందుకి న్యాయం చేయాలని ఇందల్వాయి మండల అంబేడ్కర్ సంఘ సభ్యులు మంగళవారం డిమాండ్ చేశారు. బాధ్యులపై అట్రాసిటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్సై నరేష్‌కి వినతి పత్రం అందించారు. ఎక్కువ కులం అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడన్న అక్కసుతోనే ఇదంతా చేశారన్నారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 61,900 | వెండి (కిలో) | 75,600 |
| 22 క్యారెట్స్ | 57,072 | – నిజామాబాద్ బిజినెస్ | |

### కూరగాయల ధరలు (రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 16 | 30 | క్యాప్సికం | 40 | 60 |
| బెండకాయ | 30 | 50 | గాజరుగడ్డ | 35 | 50 |
| బీరకాయ | 30 | 50 | పచ్చిమిర్చి | 50 | 60 |
| దొండకాయ | 15 | 30 | దోసకాయ | 25 | 50 |
| బీర్నీసుకాయ | 120 | 140 | ఆలుగడ్డ | 20 | 40 |
| కాకరకాయ | 35 | 50 | గోబిగడ్డ | 15 | 30 |
| వంకాయ | 20 | 40 | గోబిపువ్వు | 20 | 40 |
| పాలకూర | 30 | 50 | బీట్‌రూట్ | 25 | 50 |
| మెంతికూర | 50 | 70 | గోరు చిక్కుడు | 40 | 60 |
| కొత్తిమీర | 50 | 70 | చిక్కుడుకాయ | 50 | 70 |
| పుదీనా | 60 | 80 | | | – ఇందూరు |

### మాంసం ధరలు (రూ.)

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్సిడ్ | 220 |
| | | లైవ్ | 180 |
| స్కిన్‌లెస్ | 260 | మటన్ | 750 |

### వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | పరేషాన్-1.30, 4.30<br>బిచ్చగాడు - 2 10.30 |
| స్క్రీన్-2 | అహింస - 10.30<br>మేమ్ ఫేమస్ - 01.35<br>స్పైడర్ మాన్ అక్రాస్ - 4.30<br>పరేషాన్ - 7.30 10.30 |
| స్క్రీన్-3 | మేమ్ ఫేమస్ -10.30, 4.30,7.30, 10.40 ; అహింస -01.30 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | స్పైడర్ మాన్ ఎక్రాస్(తెలుగు)-10.00<br>(ఇంగ్లీష్) - 1.05, 7.20, 10.25<br>మేమ్ ఫేమస్ - 4.10 |
| స్క్రీన్-2 | జర హాట్‌కే జర బచ్‌కే (హిందీ) - 10.15<br>ఫాస్ట్ ఎక్స్ (3డీ - ఇంగ్లీష్) 1.10<br>పరేషాన్ - 4.10<br>2018 -07.05- మేమ్ ఫేమస్ 10.15 |
| స్క్రీన్-3 | మేమ్ ఫేమస్ -10.25<br>2018 -1.35 ; చక్రవ్యూహం - 8.00<br>అహింస - 9.50, 10.30 |
| స్క్రీన్-4 | పరేషాన్ -10.45<br>జర హాట్‌కే జర బచ్‌కే (హిందీ) - 1.40, 7.25<br>నేను స్టూడెంట్ సర్ -4.35, 10.20 |
| దేవి | బిచ్చగాడు2 |
| నటరాజ్ | స్పైడర్‌మ్యాన్ (తెలుగు) |
| లలితామహల్ | పరేషాన్ |
| విజయ్ | 2018(తెలుగు) |

# ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి



ధర్పల్లిలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మోపాల్/ఇందల్వాయి/నిజామాబాద్ అర్బన్/ధర్పల్లి: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లో ఉపాధ్యాయులు మంగళవారం ఇంటింటికి తిరుగుతూ బడిబయటి పిల్లల వివరాలు సేకరించారు. తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విన్నవించారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అంగీకరించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మోపాల్ మండలం మంచిప్ప, ఇందల్వాయి మండలం గన్నారం, ధర్పల్లి మండల కేంద్రంలో, నగరంలోని జెండాగల్లీ పరిధిలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు.

# నేడు లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లో గల కిసాన్ మున్నూరు కాపు కల్యాణ మండపం ఆధ్వర్యంలో బుధవారం లక్ష్మీ నర్సింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండపం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉత్సవ విగ్రహాలను సుబ్రహ్మణ్య స్వామి ఆలయం నుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు చిట్టి సాయిరెడ్డి, బంటు గంగాదాస్, బంటు సంతోష్, చిట్టి నారాయణరెడ్డి, పండరి పాల్గొన్నారు.